# పాపం రామనాథం

"ఇంక మీరు తెమిలి బయలుదేరండి. వేళమించిపోతే మళ్లా బ్యాంకులో సొమ్ము ఇయ్యమంటారు. ఊరోజు తప్పితే రేపు ఆదివారం బజారంతా మూతపడివుంటుంది. సోమవారం నాడు నాకు పీలకమొయ్యా పని వుంది. ఇంకా వెనక పడితే పెళ్లి వేళకి కుట్టుపనివాడి దగ్గర నుంచి బట్టలు రావు" అంటూ భర్తని తొందర చేసింది కాంతమ్మ.

అమ్మ మాట వినే మంచి కుర్రాడిలా రామనాథం భార్య ఆదేశం తలదాల్చి చెక్కు పుస్తకం చేతికర్ర పట్టుకొని బ్యాంకుకు బయలుదేరాడు. అతడు వీధి గుమ్మంలో కాలుపెట్టుంటే ఒంటి బ్రాహ్మణుడు ఎదురుపడ్డాడు. "ఛీ...ఛీ... పాడు శకునం" అనుకొంటూ వెనుతిరిగి ఇంటిలో కాలుపెట్టుంటే పక్క ఇంటివారి పెంపుడు పిల్లి 'మ్యావు...మ్యావు' అంటూ కాళ్లలో పడింది. ఆ పిల్లి అంటే రామనాథానికి అభిమానం, దానికి రామనాథం దగ్గర బాగా చనువు వుంది. అతడు పేపరు చదువుకొంటుంటే అది గుర్ గుర్‌మంటూ అతని ఒడిలో ఎక్కి కూర్చుంటుంది. అతడు వ్రాసుకొంటుంటే టేబిలు మీదికి ఎక్కి కాగితాలు మధ్య పడుకొంటుంది.

పట్టులాంటి మెత్తని చర్మం. తెల్లని ముఖం మీద లేత గులాబిరంగులో అందంగా అమరివున్న చిన్న ముక్కు, రాత్రిపూట రంగులు మారే కళ్లు. పిల్లిని చూసి రామనాథానికి ఎంతో ముద్దు వస్తుంది. పిల్లలకి బిస్కెట్లు ఇస్తూ దానికి కూడా ఓ ముక్క తుంచి వేస్తాడు. "పిల్లల్తోపాటు రోజూ దానికి కూడా వంతేమిటి? ఇలా తిన మరగిందంటే ఇక ఇల్లు వదలిపెట్టదు" అంటుంది కాంతమ్మ తను చూసిననాడు.

"వదలిపెట్టకపోతే తిననీ కాంతం. దానికి పెట్టిన దానితో మనం దరిద్రులం అయిపోము" అంటూ ఆప్యాయంగా దానిని నిమురుతాడు రామనాథం.

అది కృతజ్ఞతాపూర్వకంగా అతడి కళ్లలోకి చూస్తూ 'మ్యావు' అంటుంది. 'నువ్వెంత మంచివాడివి అన్నట్లు ఉంటుంది ఆ చూపు. మనుష్యులైతే ఎదుటివారి మెప్పు, మెహర్బానీల కోసం కల్లబొల్లి మాటలు చెప్పి పొంగేస్తారు. కాని జంతువులకి అటువంటి అవసరం ఏముంటుంది? అందుకే అది తమ మనసుకి వచ్చిన అభిప్రాయాన్ని నికరంగా ప్రకటిస్తాయి. ఆ పిల్లి అంత నమ్మకంగా నువ్వు మంచివాడివి అంటే నిజంగా తాను చాలా మంచివాడు అన్న అభిప్రాయాన్ని నిర్మించుకున్నాడు రామనాథం. ఆ రోజునుంచి ఆ పిల్లి పట్ల మంచిగా ఉండేందుకు ప్రయత్నించాడు.

కాని ఆ రోజు ఎదురుపడిన పిల్లిని చూసి విసుక్కున్నాడు రామనాథం. వీధిలోకి కాలుపెట్టేసరికి ఆ శకునం, ఇటు తిరిగే సరికి నువ్వు. ఇంక ఈ రోజు పని సవ్యంగా అయినట్లే. ఏదో నష్టం నా కోసం పొంచి వున్నదన్నమాట. అసలే డబ్బుతో కూడిన

వ్యవహారం. అంగట్లో అంతా మోసం చెయ్యాలని చూసే వాళ్లే పైకి మాత్రం తమంత నిజాయితీపరులు లేనట్లు కబురు చెప్తారు. సాలెగూడు లాంటి ఆ మాటల్లో తగుల్కొంటే ఇంకేమైనా ఉందా?

పిల్లికి అతడి కోప కారణం తెలియదు. కాని రోజులా ప్రేమతో దగ్గరికి తియ్యలేదని మాత్రం తెలుసుకొంది. "ఏమిటి" సంగతి అన్నట్లు అతడి కళ్లలోకి "మ్యావు"మని అరిచింది. చెప్తే నీకు అర్థమై చావదులే. ఇంక నడువు అన్నట్లు దానిని తప్పుకుపోయాడు రామనాథం.

"ఆ... మీరింకా ఇక్కడే ఉన్నారా? ఇంకా వెళ్లిపోయారేమో అనుకున్నాను. జేబులో పెట్టుకోవలసిన ఈ మనీపర్సు అక్కడే వదలి పెట్టారు. డబ్బు ఎందుకో పెట్టుకొని తేవాలనుకొన్నారు? ఒక్క విషయమైనా సరిగా చూసుకురాలేరు. అన్నింటికి నేను దగ్గరుండి ఎగసన తొయ్యవలసిందే. ఆ పక్క జేబులో అందరికీ కన్పించేలా నోట్లు పెట్టుకుని తేవాలని ముచ్చటగా ఉందా? అలాగే కనుక చేస్తే ఇంటికి వచ్చేసరికి మనకి లబోదిబోమని మొత్తుకోవడమే మిగులుతుంది. అసలే పట్నంలో జేబుదొంగల ముఠా ఒకటి మకాం వేసిందని అనుకొంటున్నారు. "కాంతమ్మ చింతగింజ రంగు ప్లాస్టిక్ పర్సు అందిస్తూ భర్తని మందలించింది.

"నువ్వు ఉట్టి పిచ్చిదానివే కాంతం. ఎందుకంత భయం? నా జేబులో ఉన్న డబ్బు కాజెయ్యడం అంటే అంత సులువైన పని అనుకొన్నావా? వాడికెన్ని గుండెలుండాలి?" ఉదయాన్నే క్షవరం చేసుకొన్నమాట మరచి మీసాన్ని మెలి తిప్పాడు రామనాథం.

"ఆ మరేం బడాయి. అమ్మ పుట్టింటి గొప్ప మేనమామ దగ్గర చెప్పినట్లు మీ జాగ్రత్త గురించి నా దగ్గరే చెప్పాలి. అమ్మాయి బాలసారెకి బంగారం గొలుసు తెస్తూ బజారులోనే పారేసుకోలా! ఇంకా మా తమ్ముడి వడుక్కి వెళ్తూ..."

"ఆ... చాల్చాల్లే... ఏ మాట వచ్చినా ఆ సంగతులు ఏకరుపెట్టందే నీకు తోచదు. ఈసారి చూడు ఒక్కపైసా వారా రాకుండా సొమ్ము పువ్వుల్లో పెట్టి తెస్తాను."

ఇల్లాలికి నమ్మిక కలిగేలా చెప్పి కాలు కదిపాడు రామనాథం.

"ఏమండోయి... ఇదిగో.... చూడండి..." వీధి చావిడి దాటకుండానే అడ్డు తగిలింది కాంతమ్మ.

".... పావలాకో, అర్ధకో కక్కుర్తిపడి బస్సులో వచ్చేరు సుమండీ. ఆ దొమ్మీలో ఎవడో ఒకరు ఆ కాస్త పుణ్యం కట్టుకుంటాడు. డబ్బు కోసం వెనుక తీయక ఒక రిక్షా కట్టించుకొని రండి... మరీ బ్యాంకు గుమ్మంలో ఎక్కక ఓ నాలుగు అడుగులు ముందుకి వచ్చి.... ఏదో తోవనపోతూ ఎక్కినట్లు..."

అలాగేలేవే... అలాగే మరీ అంతలా చెప్పాలా? ఆపాటి నాకు తెలియదూ? మన జాగ్రత్తలో మనం ఉండాలికాని. ఈ రోజుల్లో రిక్షావాళ్లని మాత్రం నమ్మమని ఎక్కడ వుంది. ఎండవేళ ఏ సందులో... బండిలాగి ఇస్తావా... చస్తావా... అని బెదిరిస్తే..."

"కొంపతీసి ఇచ్చేయగలరు సుమండీ."

"అబ్బే అంత సులువుగా ఇచ్చేస్తానా?" మరీ అంత తెలివి తక్కువ వాణ్ణా?

"పోనీ ఒక పనిచెయ్యండి. సొమ్ము తీసుకొని మీరు బ్యాంకులోనే కూర్చోండి నేనూ, గుర్నాథం అక్కడికి వచ్చేస్తాము. అంతా కలిసి ఆ బజారు పని పూర్తి చేసుకొని తిరిగి వస్తే సరిపోతుంది."

భార్య చెప్పిన సలహా బాగుందనిపించింది రామనాథానికి. అంత సొమ్ము చేతిలో ఉంచుకొని ఎండవేళ ఒంటరిగా రావడం మంచిపని కాదనుకున్నాడు.

ఎంత సొమ్ము, లక్షలా? కోట్లా? అంటే అలాగేం లేదు. పన్నెండు వందల రూపాయలు. కాని "ఎంత చెట్టుకి అంతగాలి" అంటారు. అతడికి అదే పెన్నిధి. కూతురి పెళ్లికోసం అవకాశం ఉన్న ప్రతిక్షణాన్ని వెచ్చించి కూడబెట్టిన సొమ్ము అతనిది. అప్పనంగా వచ్చింది కాదు. అందులో వరకట్న నిషేధం బిల్లు ధర్మమా అని మూడువేల రూపాయలు ముందుగానే వరుడి తండ్రికి ముడుపు చెల్లించుకున్నాడు. ఇంక ఉన్న సొమ్ములో ఒక వెయ్యి రూపాయలు పెళ్లికి వదిలి మిగిలిన దానితో బట్టలు, పాత్రలు కొనాలని అతని అభిప్రాయం.

తన భర్తని చూస్తూనే అందరికీ మోసం చెయ్యాలనిపిస్తుందని కాంతం నమ్మకం. ఆఖరికి తన పెళ్లి సమయంలో తన తండ్రి కూడా పెద్దల్లుడికి పెట్టినంత కట్నం తన భర్తకి పెట్టకుండా అతన్ని మోసం చేశాడని ఆమె వాదన.

ఒక విధంగా కాంతమ్మ ఆలోచనలో నిజం లేకపోలేదు. రామనాథం బజారుకి పోయి కూరలు తెచ్చిననాడు ఇంట్లో సగంమంది ఊరగాయ వేసుకొని భోజనాలు పూర్తి చెయ్యవలసిందే. ఎవరూ కొనని పుచ్చుకాయలు, చచ్చుకాయలు ఇంటికి వస్తాయి. వాటిని తాజా సరుకులు అంటూ అతన్ని నమ్మించి మరి రెండు డబ్బులు హెచ్చుగా గుంజుతారు వర్తకులు.

అందువల్లనే భర్తమీద నమ్మికతో ఏ పని వదలిపెట్టలేదు కాంతమ్మ. పెళ్లి బట్టలకి తనూ, తమ్ముడు గుర్నాథం వెంటలేనిదే కొనరాదని తీర్మానించింది. ఆ తీర్మానాన్ని రామనాథం కూడా ఆమోదించాడు.

అదివరలో ఎలా జరిగినా ఆసారి తాను మోసపోకూడదని బాధ్యతతో కూడిన ఏ పని అయినా చేయడానికి సమర్థుడనిపించుకోవాలని అనుకున్నాడు రామనాథం. బ్యాంకులో కేషియర్ అందించిన నోట్లను తిరగవేసి మరగవేసి ఒకటికి రెండుసార్లు లెక్కించుకొని భార్య ఇచ్చిన చింతగింజరంగు ప్లాస్టిక్ ఫర్సులో భద్రపరుచుకొన్నాడు. దానిని లాల్చీ జేబులో పెట్టుకొని పైని రుమాలు మడచిపెట్టి చేతిలో ఒత్తి చూసుకున్నాడు... తల్లి ఒడిలో చంటిపిల్లలా జేబులో ఒదిగిపోయింది ప్లాస్టిక్ పర్సు. గుమ్మానికి ఎదురుగా వున్న ఒక బెంచి మీద కూర్చుని భార్య రాక కోసం ఎదురుచూడసాగాడు.

అంతలో ఎవరో ఆసామి ఆ గదిలోకి వచ్చాడు. మనిషి నల్లగా జీడిగింజ రంగులో ఉన్నాడు. అంతకన్న నల్లగా వున్నాయి దుబ్బుగా, పెరిగిన వాడి మీసాలు, జేగురురంగు తలగుడ్డ చాకలి ముఖం చూడని కావి రంగు పంచె. టైరు చెప్పులు, ఎండలో ఎంత దూరం నుంచి నడచివచ్చిన వాడిలా చెమటతో తడిసి ఉన్నాడు. చూడగానే పల్లెటూరి మనిషి అనే ముద్ర ముఖం మీద కన్పిస్తుంది.

గదిలో కాలుపెట్టగానే అతడి కళ్లు ఆత్రంగా అటు ఇటు దేనికోసమో వెతుకులాడాయి. బెంచిమీద కూర్చున్న రామనాథం మీద క్షణకాలం నిలిచి అతనితో పనేలేనట్లు పక్కకి తప్పుకొన్నాయి. అలసటకి ఉస్సురని నిట్టూరుస్తూ అతడు రామనాథం ప్రక్కనే బెంచీ మీద చతికిలబడ్డాడు.

ఏదో పనున్నట్లు అంత పరుగుతో వచ్చిన వాడు తనపని చూసుకొని తన దారిన తరలిపోక ఇక్కడ తగలడ్డాడేం అనుకొన్నాడు రామనాథం. వాడి రూపురేఖలు, గదిలో కాలుపెట్టగానే వాడు ఆత్రంగా ఇటు అటు చూసిన తీరూ చూస్తే మర్యాదస్తుడిలాగా, మామ్మూలు మనిషిలాగా అనిపించలేదు అతనికి. ఎదురుగా గోడమీద "దొంగలుంటారు జాగ్రత్త" అన్న హెచ్చరిక కన్పించింది.

ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మేందుకు లేదు. మన జాగ్రత్తలో మనం ఉండాలి. మనసు హెచ్చరించింది. మనసు హెచ్చరికను మంచి పిల్లాడిలా విన్నాడు రామనాథం. ఇంతమంది తిరుగాడుతున్న చోట తనకి భయమేమిటి? తనకి తనే ధైర్యం చెప్పుకున్నాడు. అయినా ఆ నల్లనివాడి వేపు అపనమ్మకంగా చూడకుండా ఉండలేకపోయాడు. "గడప దాటుతుంటే ఒంటి బ్రాహ్మణుడు, వెనుక తిరగబోతే పిల్లి శకునం. ఈ రోజు ఏ విధంగానూ నష్టపోకుండా గడచిపోతే అంతేచాలు మరోసారి జేబులోని పర్సుని ఒత్తి చూసుకున్నాడు.

రామనాథం తనవారికోసం గుమ్మం వంక చూచి చూచి కల్లు తిప్పుకొనే సరికి ఆ పల్లెటూరి ఆసామి తనకి మరికాస్త దగ్గరగా జరిగి కూర్చున్నట్లు అనిపించింది అతనికి. కాస్తసేపు వాడివంక తీక్షణంగా చూచి పక్కగా ఉన్న ఇంకో బెంచీ మీదికి వెళ్లి కూర్చున్నాడు రామనాథం. నల్లటివాడు తనకి అదేంపట్టనట్లు ఇంకా గుమ్మం వంక చూస్తూనే వున్నాడు.

వాడికి కాస్త దూరంగా రావడంతో రామనాథం మనసు చులకనపడింది. ఈ పని ముందుగానే చెయ్యవలసింది అనుకొన్నాడు. అనుమాన పిశాచం దూరం కావడంతో ఆలోచనలు కూతురి పెళ్లిమీదకి మళ్లాయి.

నలుగురు మగపిల్లల మధ్య ఒక్కగానొక్క ఆడపిల్ల. ఎంతో అల్లారుముద్దుగా పెంచవలసింది. పాప పుట్టినపుడు తనూ కాంతం ఎన్నో కలలు కన్నారు. పెద్ద చదువులు చదివించాలి, పాట నేర్పించాలి, నృత్యం నేర్పించాలి అని. గడ్డురోజులు ముంచుకురావడంతో అవన్నీ పగటి కలలే అయిపోయాయి. దాని కడుపుకింత అన్నం పెట్టగల తాహతున్న వరుని సంపాదించడం కూడా కష్టమయిపోయింది. ఎవరిని

మాట్లాడించాలన్నా కట్నాలు కానుకలు వేలకి వేలు తనెక్కడి నుంచి తేగలడు, ఆఖరికి ఉన్నదికాస్తా ఊడ్చి పెడితేకాని దాని మెడలో ఆ మూడుముళ్లు పడడం లేదు.

రామనాథం ఆలోచనలు దేనికో గుద్దుకొని ఆగిపోయాయి. "మీరు మంచిపని చేశారు. అక్కడ ఉక్కతో చచ్చేకంటే కాస్త మారుమూల అయినా ఇక్కడ బాగుంది. పైన ఫ్యాను వుంది ప్రాణానికి హాయిగా ఉంది" అన్నాడు. ఆసామి రామనాథం పక్కనే కూర్చుంటూ.

రామనాథం మనసు జాగ్రత్త... జాగ్రత్త అంటూ మరోసారి హెచ్చరిక చేసింది. గోడమీది అక్షరాలు మరింత నల్లగా కన్పించాయి. 'నా ప్రక్కకి ఎక్కడకు వెడితే అక్కడికి ఎందుకిలా తయారవుతున్నావు, నాతో నీకేం పని?' అని అడగాలనిపించింది రామనాథానికి. కాని సభ్యతకి వెరచి ఊరుకున్నాడు.

అతడూ నాలాగే ఎవరికోసమో ఎదురుచూస్తున్నాడేమో ఎందుకు అనుమానించాలి? లేక ఈ బ్యాంకులో ఎవరైనా మిత్రులు ఉన్నారేమో వారు తమ పని పూర్తి చేసి వచ్చేవరకు నిరీక్షిస్తున్నాడేమో? అనవసరంగా అనుమానించి ఎందుకు పాపాన్ని మూటకట్టుకొనడం. మన జాగ్రత్తలో మనముంటే సరి. మనసుకి సమాధానం చెప్పుకున్నాడు రామనాథం.

అరగంట గడిచింది. గంట గడిచింది. కాంతం రాలేదు. అంతలో వచ్చేజాడ కూడా కన్పించలేదు. "ఈ కాంతానికేమయింది. మళ్ళా ఏ పనికి నేను తొందరగా తెమలని చెబుతుంది. బ్యాంకులోంచి సొమ్ము తీసుకోవడం ఏళ్లూ, పూళ్లూ అవుతుందనుకొందా? ఆ గుర్నాథంగాడు ఇంకా రాలేదేమో! అయినా కాంత చాదస్తంకాని అతడు నాకన్నా బాగా బేరాలు ఆడగలడా! వయసులో పెద్దవాడనా? పది పెళ్లిళ్లు చేసి ఉన్నవాడనా? భార్యపై విసుక్కున్నాడు రామనాథం.

అతడి ప్రక్కన కూర్చున్న వ్యక్తి కూడా దేనికోసమో చూసి, చూసి విసిగిన వాడిలా భ్రుకుటి ముడివేసి, ఇంక ఈ రోజుకి ఈ పని కాదన్నట్లు అసహనంగా లేచి చరచర వెళ్లిపోయాడు.

అంతలో "బావా" అంటూ పిలుస్తూ గుర్నాథం లోపలికి వచ్చాడు, "ఆ... వచ్చారా... వచ్చారా, చాలా ఆలస్యం చేసేశారు, గంటసేపై మీ కోసం చూస్తున్నాను" అంటూ తొందరగా లేచి నాలుగు అడుగులు వేశాడు రామనాథం. అప్రయత్నంగా అతనిచేయి పక్కజేబులోకి పోయింది. అందులో ఏముంది చాకిరేవులో ఇసుక చేతికి తగిలింది.

అతడి కాళ్లు గడగడలాడాయి. కళ్లు బైర్లు కమ్మి పచ్చబడ్డాయి. ఒంటి బ్రాహ్మణుడు, నల్లపిల్లి కళ్లముందు తారట్లాడారు. ఆ సమయంలో కలిగిన ఆ నష్టం యితడికి సామాన్య విషయం కాదు.

బాధతో కళ్లలో నీళ్లు తిరగాయి. ఆ కన్నీటి పొర వెనుకగా దృష్టికి ఏదో కన్పించింది. రెప్పల్లల్లార్చి తాను అంతవరకు కూర్చున్న బెంచి వైపు నిదానంగా చూశాడు. చింతగింజ రంగు ప్లాస్టిక్ పర్సు అతని తొందరపాటుకి నవ్వుతూ అక్కడ పడి వుంది. మనసు సంతోషంతో

ఎగిరి గంతేసింది. కాళ్లు చకచక అడుగులు వేశాయి. ఉత్సాహంగా దానిని అందుకోడానికి చేయి ముందుకి సాగింది.

"ఏమయ్యింది బావా?" ముందు వస్తున్న గుర్నాథం వెనక్కి తిరిగాడు. "అబ్బే ఏం లేదు" మీ అక్కయ్యకి ఇప్పటికి ఇల్లు కదిలేందుకు ముహూర్తం కుదిరిందా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు నవ్వుతూరామనాథం.

"కాంతం రాలేదు" వీధిలో కాలుపెడుతూ అన్నాడు గుర్నాథం. "ఏం... ఏమయింది?" ఆత్రంగా ప్రశ్నించాడు రామనాథం, "మీరు బయలుదేరేముందు అది మరిచిపోయిందట. ఈరోజు ఆ పట్టుచీర కొట్టుకి శెలవురోజు. మీకా సంగతి చెప్పి మిమ్మల్ని పిల్చుకు రాకపోతే... సాయంకాలం వరకూ ఇలాగే ఉండిపోతారని..." నవ్వుతూ బావగార్ని పరిహాసం చేశాడు గుర్నాథం.

"ఆ.... ఎందుకు ఉండిపోతాను,- మరొక అరగంట చూసి మీరు రాకపోతే నేను బయలుదేరి రావాలనుకొంటున్నాను. మీరు ఇటు... నేను అటు అయిపోతామేమో అని కాని..." బావమరిది ప్రక్కన రిక్షాలో కూర్చుంటూ ధైర్యంగా అన్నాడు రామనాథం. జాగ్రత్త కోసం మరొక సారి జేబులో పర్సుని తడిమి చూసుకున్నాడు. అది వెచ్చగా, మెత్తగా తన ఉనికిని తెల్పుకొంటూ చేతికి తగిలింది.

"ఆ...ఆ... వచ్చారా?" ఎంత కాలానికో చూసినట్లు భర్తని ఆప్యాయంగా పలకరించింది కాంతమ్మ.

"ఆ... రాక అక్కడే ఉండిపోతాననుకున్నావా?"

"ఏదీ మరి, మా తమ్ముడు వచ్చేదాకా కాలు కదిపారా? ఆ మాటే వాడితో అన్నాను. కాస్తసేపు చూసి మనం రాలేదని తిరిగి రా(ర్రా)బాబూ, పోయి పిల్చుకురా?" అని.

"అక్కడికి మీ తమ్ముడు నాకు కావలా అన్నట్లు."

"మీక్కాదండీ బాబూ! మీ జేబులో ఉన్న డబ్బుకి. ఇంతకీ సరిగ్గా లెక్క చూసి తెచ్చారా."

"ఓ... నయాపైసలతో సహా, ఏమిటీ మరీ అంత అజాగ్రత్తపరుణ్ని అనుకొన్నావా? బ్యాంకులో పుచ్చుకొన్న డబ్బు ఇంటికి తెచ్చేలోగానే పారేసుకొంటానా?" గర్వంగా జేబులోంచి పర్సు బైటికి తీసి నోట్లని లెక్కపెట్టసాగాడు.

"ఒకటీ... రెండూ.. అరే... అరే..."

"ఏమిటండీ... ఏమయిందీ? ఏమిటలా వెర్రిగా చూస్తున్నారు" ఆత్రంగా ప్రశ్నించింది కాంతమ్మ.

ఏమని చెప్తాడు? సర్వనాశం అయిపోయింది. రామనాథం కళ్లలో నీళ్లు నిల్చాయి. గొంతుకు బొంగురుపోయింది.

జీడిగింజరంగు శరీరం, కావి పట్టిన పంచెతో ఉన్న ఆసామి కళ్లలో మెదిలాడు. ఎంతపని చేశాడు దుర్మార్గుడు. సన్నసన్నగా వంద రూపాయలు నోట్లు లాగి పదిరూపాయల నోట్లు, చిల్లర వదలిపోయాడు. వాడిని చూడగానే అనుకొన్నాను. ఇటువంటి ఉద్దేశంతోనే వచ్చి ఉంటాడని అందుకే పక్కపక్కని తారట్లాడుతున్నాడని. ఎంతో జాగ్రత్తగా ఉండాలనుకొటూనే మోసపోయాను. నేనెందుకు పనికిరాని వెర్రి వెంగళాయిననని మరోసారి రుజువు చేసుకున్నాను, రామనాథం మనసు విలవిల్లాడిపోయింది.

"డబ్బు పోయింది కాంతం. నువ్వు అన్నంతా చేసుకొని వచ్చాను. పర్సు పర్సులా ఉండగానే డబ్బుని అతి నేర్పుగా మాయం చేశాడు వెధవ."

"ఎవరండీ ఆ వెధవ? బ్యాంకు గుమ్మం దిగకుండానే డబ్బుని ఎలా పోగొట్టుకొన్నారు?" కంగారుగా అడిగింది కాంతం. "వాడేనే... జీడిగింజ రంగు శరీరం, కాని పంచ, జేగురు రంగు తలపాగా... వెధవ... వాడిని చూడగానే అనుకొన్నాను. ఇటువంటిదేదో చెయ్యాలనే వచ్చాడని శనిలా నేను ఎక్కడికి వెళితే అక్కడికి వెంటపడ్డాడు. సరి మన జాగ్రత్తలో మనం ఉంటే ఏం చేస్తాడు, అనుకొన్నానేకాని..."

రామనాథం మాట పూర్తి చెయ్యలేకపోయాడు.

"అయ్యో... అయ్యో ఎంతపని జరిగిందండీ? వెళ్లి ఆ చుట్టుపట్ల ఉంటాడేమో చూసిరండి ఒరే... గుర్నాథం... పోయి ఆ పోలీసు స్టేషనులో చెప్పి రారా బాబూ! ఆ మధ్య కనకం కూతురి జుంకాలు ఆర్నెల్లనాడు దొరికాయి... లింగరాజు సైకిలు ఏడాదినాడు బయటపడింది. మన అదృష్టం బాగుంటే వెంటనే దొరకవచ్చు..."

◆ ◆ ◆

రామనాథం దిగాలుపడి, విచారంగా కాళ్లీడ్చుకొంటూ తిరిగి వచ్చాడు.

"కన్పించాడా?" లేదని తెలిసే అడిగింది కాంతమ్మ.

"ఎలా కన్పిస్తాడు కాంతం. సొమ్ము దొంగిలించినవాడు మనకోసం ఎదురుచూస్తూ కూర్చుంటాడా? సన్న సన్నగా ఎక్కడికో జారుకొంటాడు కానీ..."

"పోనీ... అక్కడ ఎవరినైనా అడక్కపోయారా?"

"అదీ అయింది. వాడికి ఆ బ్యాంకులో కాతా లాంటిది ఏదీ లేదుట. రెండు మూడు రోజులై సరిగా ఆ వేళకి వచ్చి, కొంచెం సేపు కూర్చుని వెళ్తిపోతున్నాడుట. మొదటిరోజు అక్కడివాళ్లు అడిగితే తను అక్కడ ఎవర్నో కలుసుకోవాలన్నాడుట. అతడు కలుసుకోవలసిన వ్యక్తిని నేనే అయివుంటాను. ఇంక అటు ముఖం చూపించడు" అన్నాడు రామనాథం. రెండు చేతులా బుర్రపట్టుకొని మంచం మీద కూలబడుతూ–

భర్తని ఆ స్థితిలో చూసిన కాంతమ్మకి అతని మీద జాలి పొర్లుకొచ్చింది.

"కానీండి... ఏంచేస్తాం. మన సొమ్మయితే ఏదో నాటికి ఏదో రూపంలో మనింటికొస్తుంది. లేకుంటే దానికి మనకి ఋణం తీరిపోయినట్లే." అంటూ భర్తని ఊరడించింది. కుండలోని మజ్జిగ తేటని గ్లాసుతో తెచ్చి అందిస్తూ "ఎండ పడి వచ్చారు ఇది తాగి కాస్త స్థిమితపడండి" అంది. అతడు విప్పి ఇస్తున్న లాల్చీని అందుకొంటూ–

బనియను జేబులు ఎత్తుగా, మెత్తగా...

మంచం మీద గజం ఎత్తుకి ఎగిరిగంతేశాడు రామనాథం.

"ఓ... కాంతం... ఇదుగోనే నా పర్సు జాగ్రత్తగా ఉంటుందని ఇక్కడ పెట్టుకొని మరచిపోయాను" అన్నాడు సంతోషంగా.

బ్యాంకులో అతడు పుచ్చుకొన్న నోట్లు చెక్కు చెదరకుండా అందులో ఉన్నాయి.

"నేను చెప్పలేదుటండీ, మన సొమ్మయితే మనింటికి వస్తుందని, ఇంతకీ మీరేం చీకటి బజార్లలోనూ, లంచాలు పుచ్చుకొని గడించేరా, గాలికి ఎగిరే పేలపిండిలా మాయమయిందికి చెమటోడ్చి, చీమూ రక్తం ధారపోసి..." భర్త నిజాయితీని కాంతమ్మ గర్వంగా చెప్పుకుపోతున్నది.

"మరి ఆ పరుస ఎవరిది నాన్నా?" పక్కనే వున్న పాప ప్రశ్నించింది.

ఆమె అంటున్న దేమిటో అర్థం కాన్నట్లు ఆ పిల్ల వంక క్షణకాలం చూసి "అవును అది ఎవరిదంటావు కాంతం? నా జేబులోకి ఎలా వచ్చింది?" అన్నాడు రామనాథం తెల్లపోతూ.

అతడికి బ్యాంకు వదలివచ్చేముందు తన పర్సు పోయిందని గాభరాపడ్డ సంగతి గుర్తుకొచ్చింది.

అయ్యో పాపం, ఈ పర్సు ఆ ఆసామిదే అయి వుంటుంది. నా సొమ్ము వాడు కాటువేశాడని అంతసేపు వాడిని తిట్టిపోసాను. వాడిది నేనే చల్లగా జేబులో వేసుకొని వచ్చాను. కొంచెం దూరంపోయి చూచుకొని ఉంటాడు. దొరుకుతుందనే ఆశతో వెనక్కి తిరిగివస్తే అక్కడేముంటుంది? అది నా జేబులో పొందికగా ఒదిగి కూర్చుంది. నేనే లోకాటువేశాననుకొంటాడు. నేనొక ఘరాన గజదొంగనని భావిస్తాడు. అతడి ఆలోచనలో అతడు ఉన్నపుడు మెల్లగా లాగేశాననుకొంటాడు.

ఎంతపని జరిగిపోయింది. ఈ నిందని బాపుకోవడం ఎలా? అతని పర్సుని అతడికి చేర్చడం ఎలా?"

రామనాథం మతిపోయినవాడిలా చూస్తూ ఉండిపోయాడు.

"కొంపతీసి, మీ పక్కన కూర్చుని మీ పర్సులో సొమ్ము లాగేశాడని ఇంతవరకు మీరు తిట్టిపోస్తున్న ఆ నల్లని ఆసామిది కాదు కదా?" కంగారుగా అడిగింది కాంతం.

"అతడిదే అయి వుంటుంది కాంతం" అంటూ పర్సులో చిరునామా వంటిది ఏమైనా ఉంటుందేమో అని అన్నీ బైటికి తీసిచూశాడు రామనాథం.

రెండు పదిరూపాయల నోట్లు. ఆరు రూపాయి నోట్లు, కొంత చిల్లర ముందు అరలో ఉంది. వెనుక దానిలో ఏవో బొత్తుపెట్టిన కాగితాలున్నాయి. అందులో చాలవరకు ఏవో స్క్రూలు, నట్లు, మేకులు కొన్నవాటి రసీదులు, పట్నంలో వివిధ ప్రాంతాలకి ప్రయాణిస్తూ వాడిన బస్సు టిక్కెట్లు, వాటి మధ్యగా ఒక రూళ్ల కాగితం మీద వంకర టింకర అక్షరాలతో వ్రాసిన ఒక ఉత్తరం ఉంది. దస్తూరిని బట్టి అది ఆడవాళ్లు వ్రాసిందని అందునా పల్లెటూరి వీధి బడిలో ఒకటి, రెండు క్లాసులు చదివి తిరిగి చాలాకాలం వరకు ఆ అక్షరజ్ఞానంతో అవసరపడని వ్యక్తి వ్రాసిందని సులువుగా తెలుసుకోవచ్చు.

ఎవరు వ్రాశారు ఆ ఉత్తరం? అందులో అతని చిరునామా తెలుసుకొనే అవకాశం ఏమైనా ఉంటుందా? అక్షరాలని కష్టం మీద అర్థం చేసుకొంటూ ఆత్రంగా ఆ ఉత్తరాన్ని చదివాడు రామనాథం.

"రంగయ్య మావా

సిట్టికి సానా జొరంగా ఉంది. సూదిమందు ఎయ్యాలంటున్నాడు డాకటేరు. సేతిలో సిల్లిగవ్వనేదు. మనూరినుంచి బుధోరంనాడు ఎంకటయ్య పట్టం వత్తన్నాడు. ఎట్టగయినా సొమ్ము జతపెట్టి ఆడిసేతికిచ్చిపంపు, డబ్బు కట్టి ఆఫీసుకాడ పదకొండు గంటల వేల ఉంటాడు. మరి మావా ఎట్టగంపుతావోమరి, సొమ్ము ఈకపోతే డాకటేరు మందుపొయ్యడు మావా, సిట్టి చచ్చిపోతుంది. అంపకపోతే నన్ను సంపినంతొట్టు."

వెనకా ముందూ ఎక్కడా ఆ ఉత్తరం వ్రాసినవారి పేరుకాని, అందుకొన్నవారి చిరునామా కానిలేదు. అతడి చేతిలో కాగితం గాలికి రెపరెపలాడుతుంటే బాధతో అతని మనసు విలవిల్లాడింది.

"ఈరోజు నాచేత ఎంతపని చేయించావు దేవుడా?" అని తల పట్టుకొన్నాడు.

నేరక చేసిన ఈ పాపానికి నువ్వు ఎంత శిక్ష విధించినా నేను అనుభవిస్తాను. కాని ఆ చిట్టిని రక్షించు. ఆ చిట్టికి తల్లికి ఏదోవిధంగా సహాయపడు. ఇంతకన్నా నేను మరేం కోరను. ఇంకేమి అర్థించను. రాత్రి పొద్దుగునా ప్రార్థిస్తూనే ఉన్నాడు రామనాథం.

కథా నిలయం
శ్రీకాకుళం